

# సప్తపది

ఈ వారం నేటినిజం సాహితీశిరోమణులకు ఎంపికైన వివిధకవుల సప్తపదులు

నిర్వాణి
శర్వాణి
సర్వులకు విజ్ఞానం అందించే చల్లని గీర్వాణి
-పంతుల లలిత-నీలాంజన
విశాఖపట్టణం

బలుపు
తలుపు
మూసుకున్న హృదయాలను చక్కని పిలుపు కలుపు.
-(కొప్పిడి వెంకట బలరామమూర్తి
హైదరాబాద్.

జ్ఞానం
విజ్ఞానం
నాకే అన్నీ తెలుసు అనుకోవటం అజ్ఞానం
-ఎస్.గిరిజాశివకుమారి
గుంటూరు

బేరాలు
తీరాలు
ఒకే ఒడ్డుపై జరుగు ఎన్నడూ నేరాలు
-బి .సాయి సత్యనారాయణ
పాయకరావు పేట

మాలలు
ఈలలు
అంతరంగములో నిండిన ప్రాణశక్తియే పరమేశ్వరుని లీలలు.
-శ్రీ విశ్వేశ్వరమ్.
భువనేశ్వర్ ,ఒరిస్సా

తత్వం!
స్త్రీత్వం!
ఆడజన్మకు సార్థకత నొసగే అపురూపవరం మాతృత్వం!
-సిహెచ్. వి . బృందావన రావు
నెల్లూరు

కోపాలు
తాపాలు
ఒకరికొకరు తీర్చుకునే జన్మజన్మల సంచిత పాపాలు
-డాక్టర్ వరలక్ష్మి హరవే
బెంగుళూరు

కల్మషం
విషం
మనసున ప్రేమను నింపుకుంటే నశించు ద్వేషం
-జె.విజయకుమారి
విశాఖపట్నం

అసత్యము
అనిత్యము
అబద్ధాన్ని వదిలేదే చెప్పి నమ్మించటం అఘాయిత్యము
-డా.వి.వి.రామ కుమార్
హైదరాబాద్

కనకమ్మ
చిలకమ్మ
అక్కల , చెల్లెమ్మల ఆనందాల సంబరం బతుకమ్మ
-అభిషేక్, హైదరాబాద్

విచక్షణ
నిరీక్షణ
తెలిసి చేసిన నేరానికి లేదు క్షమాపణ!
-ఎన్ ఆర్ తపస్వి
చెన్నై

అంపకాలు
పంపకాలు
ఆర్థిక సంబంధాలు ఇప్పుడు అనుబంధాలకు తిలోదకాలు.
-సాధన.తెరాల
ఖమ్మం.

ప్రజ్ఞత!
కృతజ్ఞత!!
ఎవరితో... ఎలా మెలగాలో తెలిపేదే విజ్ఞత!!!
-లయన్:కంబాల తిమ్మారెడ్డి
కళ్యాణదుర్గం,అనంతపురం జిల్లా

బతుకమ్మ
మెతుకమ్మ
అమ్మ దయతో సార్థకం మన పుటుకమ్మ
-పురిమళ్ల సునంద, ఖమ్మం

అక్షాంశాలు
రేఖాంశాలు
హైడ్రా ఇండ్ల కూల్చివేతలో ఏవి ప్రధానాంశాలు.
-గుండం మోహన్ రెడ్డి,
నర్సాపూర్,మెదక్

అసలు
సిసలు
అవునన్నా కాదన్నా చెయ్యాలి నమ్మకమైన బాసలు
-మహమ్మద్ అంకూస్
బెల్లంపల్లి

కరణం
చరణం
చేసే పనిలోనూ, నడతలోనూ గ్రహించాలి కార్యకారణం
-కామేశ్వరి వాడ్రేవు
హైదరాబాదు

శమి
దశమి
పాలపిట్ట దర్శనం పాపహరం -సుసంపన్నం విజయదశమి
-గంగరాజు పద్మజ
హైదరాబాద్

కలవాలి
నిలవాలి
జీవితం అనేది యుద్ధం -పోరాడి గెలవాలి
-సింగీతం విజయలక్ష్మి
చెన్నై

ఆనందకరం
సంతోషకరం
రచ్చకు , చిచ్చుకు దూరంగా ఉండడమే సంక్షేమకరం
-కోటమహంతి వెంకటరావు(కోవెరా),
విశాఖపట్నం

ఈశ్వరి
పరమేశ్వరి
దుర్గమ్మ నవరాత్రులకు అంతటా పూజలందుకునే అఖిలాండేశ్వరి!
-రంగ బాబు
హైదరాబాద్

పుణ్యాత్ముడు
జీవాత్ముడు
గతజన్మ కర్మానుసారమే ఫలితాలు ఇస్తాడు పరమాత్ముడు
-ఉదంద్రావు రమణబాబు
నరసన్నపేట

వర్తనం
ఆవర్తనం
మంచిచెడులు తెలుసుకుంటే అలవడు చక్కని ప్రవర్తనము!
-మెర్ల గోపి
కవిటి

తప్పు
ఒప్పు
ఎన్నుకుంటే అనర్థహేతువులే జీవికి తప్పదు ముప్పు.
-కరకవలస భాస్కరరాజు,
సింహాచలం,విశాఖపట్నం

బంధాలు
అనుబంధాలు
మాటలమీద మాత్రమే ఆధారపడవు సంబంధాలు
-కే.వి. కె. మూర్తి
సికింద్రాబాద్

కొమ్మలు
రెమ్మలు
పూలతో మానవాళికి సామరస్యతకు నిదర్శనం బతుకమ్మలు
-అంజని దేవి కరకవలస
విశాఖపట్నం

శివరాత్రి
నవరాత్రి
అసుర సంహారిని చేసెను దుర్గమ్మ దశమిరాత్రి
-సోమ సురేష్
గంగావతి

ఉన్నవాడు
లేనివాడు
వర్తమానం స్మృతితో సమన్వయంతో జీవించేవాడే బతికున్నవాడు
-కపిలవాయి అశోక్ బాబు
నాగర్ కర్నూల్

దరువు!
పరువు!
మానవత్వము మంటగలిస్తే మనిషికి మనుగడ కరువు.
-పుప్పు వేణుబ శర్మా,
భువనేశ్వరము,ఒడిశా.

విలయాలు
వలయాలు
తప్పని తెలిసినా.. రాజకీయాలు తప్పని ఆలయాలు !
-జీ యస్ వీ సత్యనారాయణ
హైదరాబాద్

వంకలు
శంకలు
మనసు కల్మషమయితే, దూషించడానికి దొరికే డొంకలు
-భాగ్యశ్రీ ముత్యం
కొవ్వూరు.

వీరు
వారు
మాటలతో -కలిస్తే కాలం వృధా చేస్తారు
-కొర్లాని సనత్ కుమార్
గాజువాక ,విశాఖపట్టణం

ఏరు
పారు
గోదారిని చూసన్నా అదేమని ప్రశ్నిస్తారా మీరు?
-ఉమాదేవి పోచంపల్లి గోపరాజు
రిచ్మండ్ టెక్సస్ యు.ఎస్.ఎ

చటుడు
లటుడు
అలవోకగా ఒదిగిపోతాడు పాత్రేదయినా ప్రతిభాశాలి నటుడు
(చటుడు= మండలాధికారి,
లటుడు =దొంగ)
-అర్చన కోవూరు ,హైదరాబాద్

లోకేశ్వరి
పరమేశ్వరి
కొలచిన సౌఖ్యము సంపద,ఇచ్చు జగదీశ్వరి!
-లింగాల యుగంధరాచారి,
మదనపల్లె

## కనుచూపుమేరలోనే..

అభివృద్ధికి ఆమడ దూరం
నివేదికలు, శ్వేతపత్రాలు ఎన్నొచ్చినా
పెరగడమే తప్ప
పైసా దిగని ధరల పట్టిక
బతుకంతా
భవిష్యత్తుకు కళ్లెం వేసే స్పీడ్ బ్రేకర్లు
నిరాశ నిస్పృహలతో
శ్రమజీవి కట్టుకున్న
ఆశల కుటుంబం చెల్లా చెదురౌతుంది
కన్నీటితో కడుపు నింపుకుంటూ
కాయకష్టం చేసి అలిసిన శరీరానికి
ఓదార్పుకాదు కదా
గుప్పెడు మెతుకులుండవు
కన్నీళ్లు దిగమింగుకొని
కష్టించినా ఫలితం లేదని
కళ్లముందే రాలిపోతున్న
చిగురుటాకులు
అవ్వకు అయ్యకు భారమంటూ
ఫ్యానుకు వేలడుతున్న జీవితాలు
తప్పెవరిదని నేను అడగను
తప్పించుకు తిరగద్దని విన్నపం.

(తల్లితండ్రులకు భారమని అసువులుబాసిన విద్యార్థి గురించి చదివి)



-ఎలగొండ రవి
9848770345









ప్రతులకు :
గోవర్ధన వేంకట శేషాచార్యులు
8309145260

పుస్తక సమీక్ష

# శ్రీమాన్ గోవర్ధన రాఘవాచార్యులు గారికి అక్షరాభిషేకం !

శ్రీ వైష్ణవాగ్రేసరుడు, సంస్కృత సాహిత్యో త్తుంగ తరంగం.. సంస్కృతీ శిఖరం.. గోవర్ధన జ్ఞాన పర్వతం.. ప్రముఖ కవులు, పండితులు .. శ్రీమాన్ గోవర్ధన రాఘవా చార్యులుగారి స్మృతిలో... ప్రముఖ పాత్రికేయులు, కవి శ్రీ డి.రాజారామ్మోహన్ ప్రధాన సంపాదకత్వంలో.. “గోవర్ధన రాఘవీయం” పేరుతో ఓ స్మృతి సంచికను వెలువరించారు.. రాఘవాచార్యులు గారి కుమారులు శ్రీ గోవర్ధన వేంకట శేషాచార్యులు వారి కుటుంబ సభ్యులు కలిసి శ్రీ గోవర్ధన రాఘవాచార్యులు గారికి అక్షరాంజలి సమర్పిస్తూ.. ప్రముఖ పండితులు, రచయితలు, కవుల నుండి రచనలు తెప్పించి.. అక్షరాభిషేకం చేయిస్తూ ఓ స్మృతి సంచికను వెలుగులోకి తేవడం స్వాగతించదగింది. వేంకట శేషాచార్యులు వారి అమ్మగారైన శ్రీమతి గోవర్ధన లక్ష్మి గారికి అంకితమివ్వడం అన్నివిధాలా సమర్థనీయంగా ఉంది. శ్రీయుతులు సముద్రాల వేణుగోపాలా చార్యులు, కె.ఎస్. అనంతాచార్యులు, నంది శ్రీనివాస్, చౌటి పూర్ణచందర్, కొనకంటి బాలకిషన్ మరియు శ్రీమతి మోతె హరిప్రియలు సంపాదకులుగా వ్యవహరించి ఈ సంచికను ఆద్యంతం ఆరాధనా భావం ఉట్టిపడేలా తీర్చిదిద్దారు. ఈ గ్రంథానికి ముఖచిత్రం నిండు శోభను కూర్చింది. శ్రీకృష్ణుని ఒడిలో రాఘవా చార్యులు గారు సేదతీరే చిత్రం ప్రతీ ఒక్కరినీ ఇట్టే ఆకట్టుకునేలా ఉంది. స్వర్గీయ శ్రీమాన్ గోవర్ధన రాఘవాచార్యులు గారు 1953వ సంవత్సరం మే 5వ తేదీన వేంకటమ్మ, శేషాచార్యులు పుణ్యదంపతులకు కరీంనగర్ జిల్లాలో జన్మించిన ఆయన చేగుర్తి గ్రామానికి చెందినవారు. బి.ఓ.ఎల్. సంస్కృతాంధ్రములు టీపీటి వంటి చదువులను పూర్తిచేసిన ఆచార్యులవారు వృత్తిపరంగా కరీంనగర్ వాణీనికేతన్ ఏయిడెడ్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పదవీ విరమణ చేశారు. నైష్ఠిక శ్రీవైష్ణవ సాంప్రదాయ కుటుంబంలో జన్మించిన రాఘవాచార్యులు గారు తమ తల్లిదండ్రుల నుండి సంస్కారవంతమైన సాంప్రదాయ విద్యను అభ్యసించారు. ప్రథమ శ్రేణి తెలుగు పండితులుగా వృత్తిని నిబద్ధతతో నిర్వహిస్తూనే ప్రవృత్తిపరంగా జ్యోతిష, వాస్తు శాస్త్రాల్లో పాండిత్యాన్ని ప్రదర్శించి ఎందరికో మార్గనిర్దేశం చేశారు. లక్ష్మీనారాయణ హృదయ సహిత గోపాల సహస్రనామ స్తోత్ర కదంబము అనే పుస్తకాన్ని సంకలనం చేశారు. మంత్రోపదే శాలు, భగవత్ విషయాలు, ద్రవిడ వేదాన్ని ఔత్సాహికులకు అందించిన ఘనత ఆయనకుంది. సంస్కృతంలో ఆశువుగా శార్దూలాది వృత్తాలలో, అనుష్టుప్‌లలో, తెలుగులో వివిధ ఛందస్సుల్లో పద్యాలు చెప్పిన విద్వత్ కవి ఆచార్యుల వారు. అనేక మంది ధర్మసందేహాలను నివృత్తి చేశారు. వారి మరణంతో, ఓ పండితరత్నాన్ని కోల్పోయామంటూ.. వారిమీద ఉన్న ఆరాధనా భావాన్ని అక్షరాల్లో నిక్షిప్తం చేసి రాఘవాచార్యులు గారి పట్ల తమ గౌరవభావాన్ని చాటుకుంటూ ఛందోబద్ధ పద్యాలు, వచన కవితలు, వ్యాసాలు రాసి ఈ గోవర్ధన రాఘవీయం గ్రంథానికి నిండుతనాన్ని కల్పించారు. మా నాన్నకు నాన్నే సాటి అంటూ వినమ్రంగా గోవర్ధన వేంకట శేషా చార్యులు రాసిన వ్యాసంలో వారి నాన్న జీవన విధానం, క్రమశిక్షణ, ముక్కుసూటి వ్యక్తిత్వం సద్గుణాలన్నీ ఆయనకు ప్రేరణగా నిలిచాయని కొనియాడారు. నాయకులకు నీతిబోధ చేయగలిగినంత జేసి వారికి ధర్మమార్గాన్ని చూపించారని ప్రశంసిస్తూ డా॥ డింగరి నరహరి ఆచారి, తమ స్మృతి వచనాలను ప్రకటించారు. నిత్యవైకుంఠ వాసులై నిలిచినట్టి.. రాఘవాచా ర్యుకర్పింపు ప్రణతి శతము అంటూ సాహితీవేత్త డా॥ గంద్ర లక్ష్మణరావు ఆచార్యులవారికి అక్షరాంజలి ఘటించారు. బహుభాషావేత్త, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డా॥ నలిమెల భాస్కర్ తమ రచన ద్వారా “జ్ఞానానికి మరో వర్ధమానులు ఆచార్యులవారు అంటూ తమ గౌరవభావాన్ని ప్రకటిం చారు. ప్రచారార్భాటాలకు తావివ్వకుండా వ్యక్తిత్వం, పాండిత్యం సమపాళ్లలో రంగరించి నివురుగప్పిన నిప్పులా వెలుగొందిన రాఘవాచార్యులు గారి జీవితం చిరస్మరణీయమని డా॥ మచ్చహరిదాసు ప్రకటిస్తే.. రాఘవాచార్యులు గారిని గోవర్ధన జ్ఞానపర్వతంగా అభివర్ణిస్తూ డా॥ బుర్ర మధుసూదన్‌రెడ్డి తమ అభిప్రాయాన్ని రాశారు.

డా॥ కలువకుంట రామకృష్ణ “ఆచార్యుని అమరపురి యాత్ర” శీర్షికతో రాసిన రచనలో.. ఆచార్యులవారి సంప్రదాయ జీవనశైలి సదా స్ఫూర్తిదాయకం.. ప్రాతః స్మరణీయమని పేర్కొన్నారు. జ్యోతిషంలో అపార ప్రావీణ్యము న్నా పేరు ప్రతిష్ఠలకు ప్రాధాన్యతనీయకుండా సామాన్యవ్యక్తిగా వెలుగొందాలని డా॥ ఆవుల మల్లారెడ్డి కొనియాడారు. తిగుళ్ళ శ్రీకాంత్ ఆచార్యులవారి చక్కని వైష్ణవ వేషధారణను కొనియా డుతు పద్య నీరాజనాన్ని సమర్పించారు. డా॥ ఎనుగంటి ప్రసాద్‌రావు – ఆచార్యుల వారి గుణగణాలను తమ ఆంగ్లరచన ద్వారా వివరించారు. డా॥ ముదిగొండ అమర నాథశర్మగారు “సుశ్లోకాంజలి” శీర్షికతో ఆచార్యులవారి పట్ల తమ గౌరవాన్ని చాటు కుంటూ సంస్కృతంలో తమ అభినందన చందనాలను సమర్పించారు. డా॥చక్రవర్తుల రమణాచార్యులుగారు ఆచార్యులవారిని జ్ఞానశిఖరంగా అభివర్ణిస్తే– డా॥ అడువాల సుజాత ఆచార్యులవారిని బహుముఖీన ప్రజ్ఞాశాలిగా వర్ణిస్తూ తమ రచనను తీర్చి దిద్దారు. శ్రీరామానుజ పదసంబంధంతో అడియన్ రామానుజ దాసః అంటూ ప్రత్యేకంగా ఆచార్యులవారు పలకరించేవారనీ వేదాధ్యయనం చేసే వారిని మరింత ఆదరించేవారని డా॥ కె.వరప్రసాదాచార్యులు పేర్కొన్నారు.

మాధవాశీస్సునొందు అంటూ తిగుళ్ళ శ్రీహరిశర్మ గారు తమ నివాళులు సమర్పించారు. ఆచార్యులవారు కలియుగ రాఘవుడు అంటూ వైరాగ్యం ప్రభాకర్ అంటే.. మృదుభాషి, మితభాషి అంటూ బి.వి.ఎన్.స్వామి కొనియాడా రు. డా॥ బొద్దుల లక్ష్మయ్య రాఘవాచార్యగారి ప్రాభవాన్ని పద్యాల్లో ఆవిష్కరిస్తే.. డా॥ శేషం వేణుగోపాలశర్మ గోవర్ధన రాఘవాచార్యులకు వినమ్రతా అంజలులు సమర్పిస్తూ వివిధ వృత్తాల్లో పద్యాలను రాశారు. శ్రీ గురుభ్యోనమః అంటూ డా॥ వేదుల గాయత్రి దేవి పద్యాలరూపంలో నివాళులు సమర్పించారు. రాఘ వాచార్యుల గారికి జరా మరణ ములు లేవంటూ పురాణం మహేశ్వరశర్మ గారం టే.. నమామి శ్రీరాఘవీ యం అంటూ డా॥ గర్రెపల్లి మహే శ్వర శర్మ ఆచార్యులవారు ఆయన శ్రీవైష్ణవ సంప్ర దాయానికి నిలువెత్తు నిదర్శనమని ప్రశంసిం చారు. ఆచార్యుల గారిని సద్గుణుడు అంటూ సుదర్శనం వేణుశ్రీ పేర్కొంటే.. పాండిత్యం, సంప్రదాయం, సంస్కారం ముప్పేట అల్లుకుపోయిన ఆచార్యుడతడు అంటూ దాస్యం సేనాధిపతి కొనియాడారు. పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్‌ప్రసాద్‌లాల్ గారు ఆచార్యులగారి మరణం తీరని లోటు అని అభిప్రాయపడ్డారు. కె.ఇ.స్థలశాయిగారు తమ సందేశంలో భగవద్ రామానుజుల పదాశ్రయణం వల్ల వారికి ముక్తి నిశ్చయమైన దని కైమోడ్పు సమర్పించారు. పూర్వ భాషీతురాఘవ అంటూ ఆచార్య శ్రీపాదరేణు వుగారు అంటే.. గోవర్ధనగిరి జగన్నాథా చార్యులుగారు ఆచార్యుల వారితో ఉన్న ఆత్మీయానుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

యజ్ఞవరాహక్షేత్రంలో జరిగిన ఆల్వారు సేవాప్రాజెక్టు, అధ్యయనోత్సవాల్లో రాఘవాచార్య బాబాయి కీలక పాత్ర పోషించారని శ్రీభాష్యం వరప్రసాద్ పేర్కొంటే.. కన్నెపల్లి వరలక్ష్మి గారు ఆచార్యులవారి పట్ల తమ గౌరవాన్ని చాటుకుంటూ పద్యాలను రాశారు. జ్యోతిషశాస్త్రమునందున ఎందరెందరికో శిక్షణనిచ్చారని, తగు సూచనలు చేశారని డి.వి.ఎన్.సుబ్బారావు గుర్తుచేశారు. ఆచార్యుల వారు ధన్యజీవి అని నీలగిరి అనిత అంటే.. ధర్మబోధ చేసి దైవచింతన పెంచారంటూ కుసుమ ఉప్పలపాటి పేర్కొన్నారు. రాఘవాచార్యులు మామయ్య స్థితప్రజ్ఞులు, సౌమ్యమూర్తి అంటూ వసుధాదేవి తిరుమల అంటే.. ఆచార్యులవారి సేవలను ప్రస్తుతిస్తూ నందూరి అనూరాధ అశ్రునివాళి సమర్పించారు. జ్యోతిష రంగాన శోభించి విజ్ఞుడై పరిహారములు జెప్పి బరువుదీర్చ అంటూ గంగాభవాని శంకరిదేవి మాత కొనియాడారు. గంగుల కమలాకర్, హరీష్ రావు, పద్మాదేవేందర్‌రెడ్డి వంటివారు ఆచార్యులు గారి విద్యార్థులేనంటూ కాండూరి శ్రీనివాసాచార్య తెలియజేస్తే.. గీర్వాణాంధ్ర పండితులు ఆచార్యుల వారంటూ సంకేపల్లి నాగేంద్రశర్మ పేర్కొన్నారు. సంస్కృతాంధ్రములను చక్కగా చదివారంటూ ఎం.సాంబ మూర్తి అక్షర సుమాలు సమర్పిస్తే.. ఎంతో భక్తిశ్రద్ధలతో గోదాదేవి పూజలు సల్పా రంటూ.. కల్లె నరసింహ నివాళులు సమర్పించారు. అజ్ఞానపు గిరులను జ్ఞానశిఖ రాలు గా మారిన గోవర్ధను డతడు అంటూ గాజుల రవీందర్ రాస్తే.. ఆచార్యులవారిని కొత్త అనిల్ కుమార్ గోవర్ధన శిఖరంగా అభివర్ణిం చారు.

విద్యార్థులకు బ్రతుకుజ్యోతిని చూపిన గురువు అమరజ్యోతిగా మిగిలే మన ఆత్మలందు అంటూ దామరకుంట శంకరయ్య రాస్తే.. కనిపించే దైవంగా మాధవ్ గుర్రాల పేర్కొనారు. సాహిత్యంలో విశేష పాండిత్యం ఉన్నా సామాన్య జీవనమే ఆయన విధానమని అన్నవరం దేవేందర్ అంటే.. శ్రీమతి టి.ఆండాళు తమ మనసు పొరలోని మధురజ్ఞాపకాలను అక్షరాల్లో నిక్షిప్తం చేస్తూ ఆచార్యుల గారిని గుర్తు చేసుకున్నారు.

గోవర్ధన రాఘవాచార్యులు ‘కర్మయోగి’ అంటూ కాండూరి వేంకటేశ్వర్లు తమ వ్యాసాన్ని రూపుదిద్దారు. సంస్కృతాంధ్ర భాషాభూషణులు – బహుముఖ శేముషీ దురంధరులు రాఘవాచార్యులు గారంటూ సముద్రాల వేణుగోపాలాచార్య తమకు ఆచార్యులవారితో ఉన్న అనుబంధాన్ని మనతో పంచుకున్నారు. శ్రీమతే రామానుజా యనమః అంటూ ఆచార్యులవారికి అక్షర సుమాలు సమర్పించారు. శేషం క్షమామణి ఆ పాతజ్ఞాపకాలను గుర్తు చేసుకుంటే.. జ్యోతిష వాస్తు శాస్త్రాలలో ఘనతకెక్కిన ప్రజ్ఞాశీలుడతడు అంటూ రేగులపాటి విజయలక్ష్మి స్మృత్యంజలి సమర్పించారు. కర్మయోగి మా రాఘవాచార్యులు అంటూ మరింగంటి అనంతాచార్య పద్యాలు రాస్తే.. మరింగంటి శ్రీనివాసాచార్య ఆచార్యుల వారిని విఠలశర్మ పేర్కొంటే.. ఆచార్య దరిపల్లి రాజగోపాల్ ఆచార్యుల వారి గుణ గణాలను ప్రస్తావిస్తూ – రాఘవ శ్లోక త్రయాన్ని సమర్పించారు. నిరాడంబరుడి నిష్క్రమణ అంటూ గాజోజు నాగభూషణం నివాళులు అర్పిస్తే.. ఆచార్యులవారు నిగర్వి అంటూ కాండూరు లక్ష్మణాచార్య స్మృత్యంజలులు సమర్పించారు. సిహెచ్. పూర్ణచందర్ రాఘవునితో ఉన్న జ్ఞాపకాలను పంచుకుంటే.. వర్తమాన ప్రపంచంలో పాండిత్య ప్రకర్ష కలిగిన అతికొద్ది మహానుభావులలో ఆచార్యులవారు ఒకరంటూ గంగవరం నాగేశ్వరశర్మ పేర్కొన్నారు. అధ్యాపక వరిష్ఠులు ఆచార్యుల వారంటూ మాడిశెట్టి గోపాల్ అంటే.. గుండి మోహన్‌శర్మ ఆచార్యుల వారితో ఉన్న జ్ఞాపకాలను అక్షరీకరించారు. రాఘవాచార్యులు గారితో అనుబంధం బలపడటానికి ఏర్పడిన సందర్భాలను పొడిచేటి రామకృష్ణమాచార్యులు గుర్తు చేసుకుంటే.. వేనవేల విద్యార్థుల భవితకు పునాదులేసిన ఆచార్యోత్తమ అంటూ సిహెచ్. రమణాచారి అభినందన కుసుమాంజలులు సమర్పించారు. నా సాహితీ ఆటోలో పయనిస్తూనే ఉంటాడంటూ కవి. ఎం.డి.ఖాలిద్ కొనియాడారు.

సౌభాగ్య జీవనాన్ని సార్థకం చేసిన ధన్యుడతడు అన్న అర్థం ధ్వనించేలా సీస పద్యంద్వారా మల్లావఝుల నారాయణశర్మ తమ నివాళులు సమర్పించారు. అందరికి మంచి పంచిన ఆప్తుడతడు అంటూ తిరుమల లక్ష్మణాచార్యులవారు రాస్తే.. ఆచార్యుల వారి ఆధ్వర్యంలో అనేక పౌష్టికాలు, శుభకార్యాలు ఎన్నో చేయించిన మహానుభావులు అంటూ సముద్రాల సుప్రసన్నాచార్యులు తమ వ్యాసాన్ని తీర్చిదిద్దారు. కాలం వారిని కబళించినా కలకాలం మన హృదయంలో ఆయన జీవించే ఉంటారని నమిలికొండ రమణాచార్యులు పేర్కొంటే.. మానవజాతికి మర్యాదను నేర్పిన రాఘవుని బాటలో పాఠాలు నేర్చుకుంది. నేర్చిన పాఠాలను పదిమందికి పంచే ఆచార్యునిగా అవతరించిం దంటూ నంది శ్రీనివాస్ కొనియాడారు. విశిష్టాద్వైతమ్ విశ్వజనీనమని విశ్వసించిన వాడని స్తంభంకాడి గంగాధర్ పేర్కొంటే.. లోక కళ్యాణ క్షేమాలు కోరుతూ భూమిపై పుట్టిన పుణ్యపురుషులు అంటూ కాకెరి శంకరశర్మ రాశారు. సమాజహితం వారి మతం అంటూ దొమ్మాటి శంకరప్రసాద్ రాస్తే.. గోవర్ధనగిరిధారి అంటూ బొమ్మకంటి కిషన్ పేర్కొన్నారు. వారితో గడిపిన క్షణాలు మరువలేనివి అంటూ చౌదరిమఠం వినోద్ కుమార్ శాస్త్రి గుర్తుచేస్తే.. నాన్నతో ఉన్న అనుబంధాన్ని అక్షరాల్లో ఆవిష్కరిస్తూ వారి కూతురు మోతీలాల్ (మోతె హరిప్రియ) తమ రచనను రూపుదిద్దారు. కొండంత ఘనుడవు నీవయ్యా అంటూ ఎ.గజేందర్‌రెడ్డి రాస్తే.. పద్యకవి–ధన్యజీవి అంటూ సదాశ్రీ శ్రీమంతుల కొనియాడారు. ఒక్కజీవితం – ఎన్నో కోణాలు అంటూ శ్రీకర్ గంగుల రాస్తే.. రాఘవాచార్య మహాంభజే అంటూ దాసరి శ్రీపాల్‌రెడ్డి తమ సంతాప సందేశాన్ని అందజేశారు. సామాన్య ప్రజల పక్షాన నిలిచిన మహనీయుడంటూ విలాసాగరం రవీందర్ రాశారు.

నాన్న ! మీ జాడ ఎక్కడ? అంటూ నాన్నతో ఉన్న జ్ఞాపకాలను వారి కూతురు ఆముక్తమాల్యద మనతో పంచుకున్నారు. గోవర్ధన వంశ ఇంటికి పెద్ద కూతురునై జన్మించడం నా జన్మ తరించిందంటూ కొనసాగించారు. ఈ స్మృతి సంచికకు ప్రధాన సంపాదకత్వం వహించిన ఆచార్యులవారి పెద్దల్లుడు, కవి పాత్రికేయుడు డి.రాజారాం మోహన్ వైష్ణవ భక్తిప్రపత్తులతో వైష్ణవ తేజంబు జగతిన వర్ధిల్ల జేశారని మామగారి పట్ల తమ గౌరవాన్ని చాటుకున్నారు. పైన పేర్కొన్నవారే కాక.. కల్వకుంట వేదాంతా చార్యులు, గుండి మోహన్‌శర్మ, మంత్రవాది వీరవేంకట సత్యనారాయణ, గసికంటి సంజీవ్, బంధకవి సుబ్బలక్ష్మి, తోటపెల్లి బాలసుబ్రహ్మ ణ్యశర్మ, జక్కని గణేశ్, కంజర్ల రామాచార్య, నమిలికొండ రాజగోపాలాచార్యులు, కాండూరి బలరామశర్మ, చొప్పా సుబ్రహ్మణ్యం, గంగాధర్ కొల్లేపర, మరింగంటి శ్రీనివాస్, తిరునగరి లక్ష్మణసామి, సముద్రాల రామానుజాచార్యులు, నమిలికొండ జయంత్‌శర్మ, సముద్రాల రంగా చార్యులు, వడుకాపురం అనంతరామాచారి – వారి కుటుంబ సభ్యులు, కొరిడె గుండయ్య, గోవర్ధనగిరి లక్ష్మీనరహరి ఆచార్యులు, సముద్రాల లక్ష్మీనరసిం హాచార్య, తల్లం దేవిప్రసాదశర్మ, శ్రీ పెరంబుదూరి వేణుగోపాలా చార్యులు, సేనాపతి శేషా చార్యులు మరియు మణినాథ్ కోపల్లె మొదలగువారు గోవర్ధన రాఘవాచార్యుల గారికి సమర్పించిన నివాళులు ఈ గ్రంథానికి నిండుదనాన్నిచ్చాయి. ఇలా ఓ గొప్ప పండితుడగు గోవర్ధన రాఘవాచార్యులు గారి స్మృతిలో ఓ సంచికను వెలువరించడంలో సహకరించిన ప్రతీ ఒక్కరికీ అభినందనలు తెలియజేస్తున్నాను.



– దాస్యం సేనాధిపతి
సెల్:9440525544

## విజేత



-డి.కె.చదువులబాబు
9440703716

బాల్యంలో చదువు బరువు
యవ్వనంలో నిరుద్యోగం బరువు
మధ్య వయస్సులో సంసారం బరువు
వృద్ధాప్యంలో అనారోగ్యం బరువు
బతకడమే కాని జీవించిందెప్పుడు?

ఉరుకుల పరుగుల జీవితంలో
ఒక్కసారైనా ఆగుదాం
వెనుదిరిగి చూసుకుందాం
మనసు లోలోపలి పొరల్ని విప్పి వెదుకుదాం
బతుకుతున్నామా...జీవిస్తున్నామా?
జీవించడం తెలిసినవారే విజేతలు!

## బాలరామ

భార్య యందు ప్రేమ బాగుగా నున్నను
కాపురమ్ము సాగు కలత లేక
భార్యయున్న భర్త భాగ్యవంతుడునౌను
భక్త పారిజాత బాల రామ.

భర్త యందు ప్రేమ బలముగానున్నను
కలత చెంద బోదు కాంతరమణి
భర్త కలిగి యున్న భార్య సుగుణశీలి
భక్త పారిజాత బాలరామ.

భ్రమలు వద్దు నీకు బలగమందు నరుడా
కాకి బలగ మంత కనుము నిజము
నిప్పులాంటి నిజము నిలలోన నిదియేను
భక్త పారిజాత బాల రామ.

కన్న కొడుకు యనుచు కలలు కనుట మాను
కాల మహిమ చేత కాలయములు
ముసలి తనము నందు మొసలిగా నుందురు
భక్త పారిజాత బాలరామ.

కన్న ప్రేగు పట్ల కాయము శ్రమ పడు
కాలు చేతులన్ని కరిగిపోగ
కదల లేని మేను కాటిని కోరును
భక్త పారిజాత బాలరామ



-జాధవ్ పుండలిక్ రావు పాటిల్
9441333315

## రాణి – జింక



నెమళ్ళదిన్నె గ్రామం అడవికి దగ్గరలో ఉంటుంది.ఆ గ్రామంలో రాణి అనే అమ్మాయి ఉంది.ఒకరోజు రాణి బడినుండి వస్తూ దారిలో ఓ జింక కుంటుతూ రావడం చూసింది.దగ్గరకెళ్ళి కుంటుతున్న కాలును చూసింది.కాలుకు గాయమై ఉంది.’అడవినుండి తప్పిపోయి వచ్చినట్లుంది’అనుకుంటూ ఇంటికి పిల్చుకుని వచ్చింది.అమ్మకు విషయం చెప్పింది.ఆమె ఆయుర్వేద వైద్యుడి దగ్గరకు జింకను తీసుకెళ్ళి వైద్యం చేయించింది.రాణి జింకకు ఆహారం పెడుతూ,రోజూ వైద్యుడి వద్దకు తీసుకెడుతూ జింకను కంటికి రెప్పలా చూసుకుంది.వారం తిరిగేసరికి గాయం నయమైంది.రాణి అమ్మతో “జింకను మనమే పెంచుకుందాం” అంది.

”జింకకు అడవిలో పిల్లలుంటాయి. పరిచయమైన స్నేహితులు ఉంటారు.

వాటిని వదిలి ఇది మనుష్యులమధ్యన ఉండలేదు.గాయం నయమైంది కదా!దాన్ని అడవిలో వదిలేయడమే మంచిపని “అంది అమ్మ.మరుసటి రోజు రాణి జింకను వెంటబెట్టుకుని అమ్మ తో కలిసి అడవి దగ్గరకు వెళ్లి జింకను వదిలేసింది.జింక ఆనందంతో అడవిలోకి పరుగులు తీసింది.



– బి.సింధూర.
9వ.తరగతి.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. పెద్ద చెప్పలి
గ్రామం.కమలాపురం (మం)వై.యస్.ఆర్.కడప జిల్లా.
940703716.

## మనిషి మనస్తత్వాలు

మనసు విప్పి
మాట్లాడే సమయం కాదిది
వయసు చూసి కోట్లాడే గడియా ఇది
నీతి ధర్మాలకు విలువనిచ్చే
సమాజం కాదిది
అవినీతి అధర్మాలకు
తివాచీ పరిచే సమాజమిది !
కుట్ర కులాల కొలిమిలో చిక్కుకొని
మతాల గుర్తుల మనుగడను ఎంచుకొని
మతలబు రేఖల సుడులు గిరిగీసుకొని
చిరునామాను చీపిరులుగా చేసుకొని
ఒంటరి బతుకు ఛాయలో ఉరి వేసుకొని
దోపిడీ బాటల్లోకి
అడుగులు వేస్తున్నారు !
ప్రేమానురాగాలతో
నిండుకోవాల్సిన జీవితాలు
మృత్యువుతో సవాల్ చేస్తూ
అనుమానపు కాలుష్యపు కడలిలో
కలిసిపోవాలని ప్రయత్నిస్తున్నారు !
చూడరా చూడరా
మనిషి బతుకు మ‘నీ’తో
ఏలా మూడివేశారో...!
ఉన్నోడు లేనోడని
తేటతెల్లపు పుస్తకంపై
రాతలు రాసింది
శృతులుతిప్పి సుఖాన్నిపెంచి
కష్టాల్ని వదలి కడుపుకు
ఏలా తృప్తిని కలిగిస్తున్నరో..!
నిజాల్ని నేలకు త్రొక్కివేసి
అబద్ధాలను చిలికి త్రాగుతున్నారు !
కట్టుకున్న బట్టనుండి
కట్టె కాలేవరకు
సంపాదించిన ఆస్థులన్ని
మట్టిలో కలిసేవరకు రాలేక !
అడుగులు నేలకు తాకలేక !
కల్తీలతో కన్నీళ్లను
కడుపులో నింపుకుంటున్నారు !
నలుగురితో నాలుగు అడుగులు
ఆ ‘నలుగురి’తో మోసే
పాడే పాన్పుగా మిగిలిన కూడా
ఆ మృత్యువు నీకు నాకు ఒక్కటే
బతుకున్నపుడు లేదు ఎందుకు ?
ఉన్నపుడు ‘ఛీ’ అని
పోయినపుడు ‘అయ్యో’ అని
దొంగ కన్నీళ్లు పెట్టి
పెద్ద కర్మలు
ఘనంగా నిర్వహించే
మనసు ముసుగు తెరలు
కోకొల్లలుగా తారసపడుతూనే
వుంటాయి.
అంతిమ యాత్రకు
లేని పోనీ ప్రేమలతో
కట్టెలు పేరుస్తారు ‘చితి’ మీద
మట్టిదారాలతో’ దోస్తీ చేస్తారు
ఏ క్షణం నీదో..
ఏ క్షణం నాదో..
ఏ క్షణం ఎవరితో..
మృత్యువు ముద్దాడుతుందో
తెలుసుకోలేనంత కాలం
ఇదే వరుస తరతరాలుగా
కొనసాగుంది.
ధరణి పై మనిషి హృదయాలు
ప్రేమానురాగాలతో నిండుకొని
స్వచ్ఛమైన హృదయముతో
ప్రయాణం చేస్తామో...!
అపుడే ఆఖరి మజిలీకి శాంతి
చేకూరుతుంది
సాంత్వన చేకూరుతుంది
మనిషి మనిషికి మనసు బంధం
సిందూరమవుతుంది



-డాక్టర్ పగిడిపల్లి సురేందర్
8074846063



## బతుకమ్మ

బతుకమ్మ
తెలంగాణ అస్తితత్వ ప్రతీక
బతుకు నేర్పే అమ్మ
తెలంగాణ సంస్కృతి
పూలనే పూజించే
ప్రకృతి ఆరాధించే ఒక
పండుగ
ప్రపంచంలోనే లేదు ఎక్కడ
అది తెలంగాణ సొంతం
అది ఒక విప్లవి
అది ఒక ప్రేరణ
నైజం నిరంకుశత్వాన్ని ప్రశ్నించి
తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనలో
సబ్బండ వర్గాలను ఏకం చేసి
సాధన లో గళం అయ్యి
గానం అయ్యి ప్రతిధ్వనించింది
శ్రమ జీవుల స్వేదంలోంచి
పుట్టుకవచ్చిన గొంతుక
రామాయణ మహాభారత
ఇతిహాస కథలెన్నో
పల్లె పడుచుల నోటి వెంట
జాలురాలే భావవ్యక్తీకరణ లు
ఆరోగ్యం కు ప్రకృతి
ప్రకృతి తోనే ఆరోగ్యం
అమ్మాయిల పండుగ
ఆడపడుచులు మాంగళ్య
రక్షణ కు అమ్మవారి రూపం
లో తొమ్మిది రోజులు
ఒకొక్క ప్రత్యేక తో సాగే
పండుగ మన బతుకమ్మ.



-వి.శేషారావు
9440408080

